సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 12 । జనవరి । 2023

సకల హంగులతో కలెక్టరేట్

- అధికారులు సకాలంలో హాజరు కావాలి
- కలెక్టర్ అనుదీప్ ఆదేశం

8లో

ముహూర్తం నేడే..

- మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్‌ను ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- అనంతరం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం..
- 2.35గంటల పాటు ముఖ్యమంత్రి పర్యటన
- కలెక్టరేట్ ప్రాంగణంలోనే పబ్లిక్ మీటింగ్



విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్న నూతన కలెక్టరేట్ (ఇన్‌సెట్) సీఎం కేసీఆర్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని (ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ ఆఫీస్) ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు గురువారం ప్రారంభించనున్నారు. ఆ తర్వాత జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో నిర్మించిన బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అంతకంటే ముందు కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం 1:55 గంటలకు జిల్లాకు చేరుకుని, సాయంత్రం 4:30 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరి వెళ్తారు. సీఎం కేసీఆర్ పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రభుత్వ పరంగా జిల్లా యంత్రాంగం, పార్టీ పరంగా బీఆర్ఎస్ నేతలు కంటిమీద కునుకులేకుండా గత రెండు రోజులుగా శ్రమిస్తున్నారు.

మహబూబాబాద్ నుంచి..

ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ నుంచి సీఎం కేసీఆర్ బయలుదేరుతారు. ముందుగా మహబూబాబాద్ చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 1:30 గంటలకు మహబూబాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 1:55 గంటలకు జిల్లా నూతన కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 2 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో వెనుక వైపు ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జిల్లా అధికారులు, పార్టీ ముఖ్య నేతలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

రోడ్డు మార్గంలో..

మధ్యాహ్నం 3:20 గంటలకు బహిరంగ సభ ముగించుకుని రోడ్డు మార్గంలో కొత్తగూడెం వెళతారు. 3:35 గంటలకు భారత రాష్ట్ర సమితి జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి పూల దండలు వేస్తారు. ఆ తర్వాత బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో కొద్దిసేపు ముచ్చటిస్తారు. అనంతరం ప్రకాశం స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుని 4:30 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

గులాబీమయం

సీఎం రాక సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణం, ప్రకాశం స్టేడియం.. రెండు చోట్ల ప్రత్యేకంగా హెలిప్యాడ్లు సిద్ధం చేశారు. కలెక్టరేట్ నుంచి బీఆర్ఎస్ కార్యాలయం వరకు సుమారు ఆరు కిలోమీటర్ల మేర కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పార్టీ అధినేత రాకను పురస్కరించుకుని రోడ్డుకు ఇరువైపులా గులాబీ జెండాలు, ఫ్లెక్సీలు, భారీ కటౌట్‌లు వెలిశాయి. 'మీ వనమా' పేరుతో స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు భారీ ఎత్తున స్వాగత కార్యక్రమాలు చేపట్టారు. సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు సిద్ధమయ్యారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు పరిమిత సంఖ్యలో ఆహ్వానాలు ఉన్నందున ముఖ్య నాయకులే రావాలని ఆ పార్టీ నేతలు విజ్ఞప్తి చేశారు.

కోటలా కలెక్టరేట్



ఆర్కిటెక్ట్ ఉషారెడ్డి

-వివరాలు 10లో

క్లుప్తంగా

రెండో విడత కంటివెలుగుపై మాక్‌డ్రిల్



సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌ఓ శిరీష

చుంచుపల్లి: కొత్తగూడెం రైతు వేదికలో బుధవారం కంటివెలుగు రెండో విడత కార్యక్రమంపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వెలుగు నోడల్ అధికారి బి.రవి కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష మాట్లాడుతూ వైద్యాధికారులు విధుల్లో అలసత్వం ప్రదర్శించొద్దని హెచ్చరించారు. కంటి వెలుగు పరీక్షలకు వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పర్షియా నాయక్, డిప్యూటీ డెమో ఫయాజ్ మొహినుద్దీన్, డీపీఓ దుర్గ, డాక్టర్ సుందర్, ఇమ్మానియేల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారిగా చైతన్య



డాక్టర్ రేపాక చైతన్య

దుమ్ముగూడెం: నర్సాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి రేపాక చైతన్యను జిల్లా ఎంసీహెచ్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్‌గా నియమిస్తూ జిల్లా వైద్యాధికారి శిరీష బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఎంసీహెచ్ జిల్లా ప్రోగ్రామింగ్ అధికారిగా పనిచేసిన డాక్టర్ సంధ్యారాణి ఖమ్మం జిల్లాకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో చైతన్యను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. గతేడాది జరిగిన కౌన్సెలింగ్‌లో రెగ్యులర్ డాక్టర్‌గా చైతన్య నియమితులైన విషయం తెలిసిందే.

డాక్టర్ తెల్లం వెంకట్రావుకు అస్వస్థత



మెరుగైన వైద్యం కోసం డాక్టర్ వెంకట్రావును అంబులెన్సులో తరలిస్తున్న దృశ్యం

భద్రాచలం: ప్రముఖ వైద్యుడు, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తెల్లం వెంకట్రావు గురువారం అస్వస్థతకు గురయ్యారు. గుండె నొప్పితో బాధపడుతున్న ఆయన్ను కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. పరీక్షల అనంతరం ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలని వైద్యులు సూచించారు. దీంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కాగా మంచి వైద్యుడిగా పేరున్న వెంకట్రావు అనారోగ్యానికి గురవడంతో అభిమానులు, పట్టణ ప్రముఖులు ఆస్పత్రి వద్దకు చేరుకుని వివరాలు తెలుసుకుంటున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,881

సీఎం సారు.. దృష్టి సారించేనా?



కొమరారం గ్రామం

ఇల్లెందు: రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నూతన, సమీకృత కలెక్టరేట్ భవనం ప్రారంభించేందుకు గురువారం జిల్లాకు వస్తున్నారు. ఈ క్రమంలో ఏళ్ల తరబడి పరిష్కారంకాని సమస్యలపై దృష్టి సారిస్తారని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు. ఇల్లెందు కేంద్రంగా రెవెన్యూ డివిజన్, కొత్తగా కొమరారం, బోడు మండలాల ఏర్పాటు, పాల్వంచ మున్సిపల్ ఎన్నికల నిర్వహణ, రోళ్లపాడు ప్రాజెక్ట్ నిర్మాణంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొత్త మండలాలు కొలిక్కివచ్చేనా..?

ఇల్లెందు కేంద్రంగా నూతన రెవెన్యూ డివిజన్, కొమరారం, బోడు కేంద్రాలుగా కొత్త మండలాల ఏర్పాటు ప్రక్రియ అటకెక్కింది. ఏళ్లు గడుస్తున్నా కార్యరూపం దాల్చటం లేదు. కొమరారం, బోడు రెండూ మండల కేంద్రానికి అనుకూలంగా ఉన్నాయి. ఇప్పటికే కొమరారం పరిధిలో కాచనపల్లిలో పోలీస్ స్టేషన్, ఆంధ్రా బ్యాంక్, ఏపీజీవీబీ మినీ బ్రాంచ్, పీహెచ్‌సీ, రొంపేడులో పీహెచ్‌సీ, ఎస్‌బీఐ బ్రాంచీ, పశువైద్యశాల, సబ్ స్టేషన్, ఫారెస్టు రేంజ్ కార్యాలయం, సబ్ పోస్టాఫీస్ తదితర కార్యాలయాలు, పెట్రోల్‌బంక్ ఉన్నాయి. ఇల్లెందు నుంచి కొమరారం 16 కిలోమీటర్ల దూరంలో ఉంది. కొత్త మండలం ఏర్పాటు చేస్తే తహసీల్దార్, వ్యవసాయ, ఎంఈఓ కార్యాలయాలు ఏర్పాటు చేస్తే సరిపోతుంది. ఇక టేకులపల్లి మండలంలో ఉన్న బోడు గ్రామం కూడా కొత్త మండల కేంద్రానికి అనుకూలంగా ఉంటుంది. పోలీస్ స్టేషన్, హైస్కూల్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల కోసం భవనాలు ఉన్నాయి. పూర్వపు తాలూకా, సమితి కేంద్రమైన ఇల్లెందును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. ఇల్లెందు మండలం, మున్సిపాలిటీ, టేకులపల్లి, ఆళ్లపల్లి, గుండాల పాటు కొత్తగా ఏర్పడే కొమరారం, బోడు మండలాలు దీని పరిధిలో ఉంటాయి.

రోళ్లపాడు సంగతేంటి?



రోళ్లపాడు ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్(ఫైల్)

ఇల్లెందురూరల్: ఇల్లెందు ఏజెన్సీ ప్రజలకు గోదావరి సాగునీటి జలాలు కలగానే మిగిలిపోతున్నాయి. బయ్యారం పెద్దచెరువు మినహా నియోజకవర్గ పరిధిలో ఒక్క సాగునీటి ప్రాజెక్ట్ కూడా లేదు. దీంతో రైతులు వర్షాధారంగానే పంటలు సాగు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలను రోళ్లపాడు ప్రాజెక్టుకు తరలించి, ఏజెన్సీ గ్రామాలకు మళ్లిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. టేకులపల్లి మండలం రోళ్లపాడులో ప్రాజెక్ట్ నిర్మాణానికి 2016, ఫిబ్రవరి 18న శంకుస్థాపన చేశారు. రూ.13,057 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని ప్రకటించి, తొలి విడతగా రూ.7,926 కోట్లు విడుదల చేశారు. ఈ నిధులతో తొలుత గోదావరి నుంచి 58వ కిలోమీటర్ వరకు పనులు శరవేగంగా చేపట్టారు. ములకలపల్లి మండలం కమలాపురం వద్ద పంప్‌హౌస్ నిర్మించారు. ఇక్కడి నుంచి నీటి సరఫరా రెండు పాయలుగా విడిపోయి ఒకటి సత్తుపల్లి, మరొకటి రోళ్లపాడు వైపు మళ్లించాల్సి ఉంది. కానీ పలు కారణాలు చూపి ఇటువైపు పనులు నిలిపివేశారు. మూడేళ్లు గడిచాక రోళ్లపాడు సంగతేటని రైతులు ప్రశ్నించడంతో స్థానిక ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ చొరవతో మరోసారి సర్వే చేపట్టారు. ఇక అంతటితో చేతులు దులుకున్నారు.

పాల్వంచ మున్సిపల్ ఎన్నికలెప్పుడో!

పాల్వంచ: ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీగా, పారిశ్రామిక పట్టణంగా ఉన్న పాల్వంచలో 21 ఏళ్లుగా ఎన్నికలు జరగడంలేదు. పాలకవర్గంలేక ప్రత్యేక అధికారుల పాలనలోనే నడుస్తోంది. పురపాలకంలో 24 వార్డులు, స్లమ్ ఏరియాలు ఉండగా, అభివృద్ధి కుంటుపడటంతోపాటు జవాబుదారీతనం లోపిస్తోందని పట్టణవాసులు పేర్కొంటున్నారు. 1987 ఫిబ్రవరిలో పాల్వంచ గ్రామ పంచాయతీని తృతీయ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. అదే ఏడాది మార్చిలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించారు. 1992 వరకు పాలకవర్గం కొనసాగింది. తర్వాత మూడేళ్లపాటు ఎన్నికలు జరగలేదు. తిరిగి 1995లో ఎన్నికైన పాలకవర్గం 2000 సంవత్సరం వరకు కొనసాగింది. ఇక ఆ తర్వాత ఎన్నికలు జరగలేదు. పాల్వంచ ఏజెన్సీనా, నాన్ ఏజెన్సీనా అనే వాదనలు ఎప్పటికప్పుడు చర్చాంశనీయంగా మారుతుండటం, దాని ప్రభావం ఎన్నికలపై పడుతుండటం పరిపాటిగా మారింది. దీనిపై వివాదం కోర్టులో ఉందని పలువురు పేర్కొంటున్నారు. పాలకవర్గంలేక మున్సిపాలిటీలో గతంలో అనేక అవినీతి ఆరోపణలు, అక్రమాలు వెలుగుచూశాయి. పలుమార్లు విచారణ కూడా చేపట్టారు. కాగా ఎన్నికలు నిర్వహించాలని గతంలో అఖిల పక్షం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. పార్టీలతో పాటు, ప్రజా సంఘాలు సైతం అనేక సార్లు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్వంచకు వస్తున్న తరుణంలో ఇక్కడి ఎన్నికలపై దృష్టిసారించాలని పట్టణవాసులు కోరుతున్నారు.



పాల్వంచ మున్సిపల్ కార్యాలయం

వ్యవసాయాశాఖ అధికారులపై విచారణ



విచారణ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు

ములకలపల్లి : వ్యవసాయశాఖ అధికారులు అఫ్జల్ బేగం, ఏఓ కరుణామయి, ఏఈఓ మౌనికలపై జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు విచారణ నిర్వహించారు. ఏఈఓ మౌనిక రైతులకు అందుబాటులో ఉండటం లేదని రైతు సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమెను సరెండర్ చేశారు. కాగా ఏడీఏ అఫ్జల్ బేగం, ఏఓ కరుణామయి తన వేతనం నిలిపివేసి, కక్షసాధింపునకు పాల్పడుతున్నారని ఏఈఓ మౌనిక వ్యవసాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు బుధవారం స్థానిక రైతు వేదికలో విచారణ చేశారు. ఏడీఏ, ఏఓ, ఏఈఓలపై వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులను అందజేస్తామని తెలిపారు.

కళ్లలో కారం.. కర్రలతో దాడి

– ముగ్గురిపై కేసు

పాల్వంచరూరల్: భూ వివాదంలో ముగ్గురు యువకులు దారికాచి కళ్లలో కారం చల్లి దాడిచేసి గాయపర్చారు. ఈ సంఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని రంగాపురం గ్రామానికి చెందిన మాళోతు తారచంద్ అనే రైతు మంగళవారం ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన నూనవత్ రమేష్, బానోత్ వంశీకృష్ణ, బానోత్ రాధాకృష్ణ నాగారంకాలనీ సమీపంలో దారికాచి కారం చల్లారు. అనంతరం కర్రలతో దాడి చేసి గాయపర్చారు. బాధితుడి కుమారుడు బుధవారం ఫిర్యాదు చేయగా, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

సకల హంగులతో కలెక్టరేట్

- నేడు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభం
- అధికారులు నకాలంలో హాజరు కావాలి
- కలెక్టర్ అనుదీప్ సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సకల హంగులు, అధునాతన సౌకర్యాలతో నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)ను ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం ప్రారంభించనున్నారని కలెక్టర్ అనుదీప్ తెలిపారు. జిల్లా అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసెస్ కాంప్లెక్స్(ఐడీఓసీ)ను ప్రభుత్వం నిర్ణయించిన కేఎస్‌ఎంకు చెందిన 26 ఎకరాల్లో నిర్మించామని, రూ 56.50 కోట్ల నిధులతో పనులు పూర్తి చేశామని చెప్పారు. ఐడీఓసీలోనే కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఆర్వో క్యాంప్ కార్యాలయాలను కూడా నిర్మించినట్లు తెలిపారు. 56 శాఖలకు గదులు నిర్మించామని, కలెక్టర్, అదనపు కలెక్టర్ల కోసం మూడు చాంబర్లు, విజిటర్స్ వెయిటింగ్ హాల్ నిర్మించినట్లు వివరించారు. కలెక్టర్, ఇద్దరు అదనపు కలెక్టర్లు, పరిపాలనాధికారి చాంబర్లను కేస్ట్ సీలింగ్(సెంట్రల్ ఏసీ) చేశామన్నారు. సమావేశపు హాల్‌ను కూడా సెంట్రల్ ఏసీగా మార్చినట్లు చెప్పారు. జీ ప్లస్ 2 పద్ధతిన నిర్మించిన కలెక్టరేట్‌లో అంతర్గత రోడ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. జిల్లా అధికారులంతా గురువారం ఉదయం 9 గంటలకు కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. మధ్యాహ్నం ముఖ్యమంత్రి కేసీఆర్ ఐడీఓసీకి హెలీకాప్టర్‌లో వస్తారని, పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, శిలాఫలకం ఆవిష్కరిస్తారని చెప్పారు. కలెక్టర్ చాంబర్‌ను పరిశీలించిన తర్వాత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం ఉంటుందని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లాపై ముఖ్యమంత్రికి ప్రత్యేక శ్రద్ధ

ఎమ్మెల్యే వనమా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాపై సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే బీఆర్‌ఎస్ పార్టీలో చేరానని తెలిపారు. ఐదుగురు సీఎంల వద్ద పనిచేసిన అనుభవం ఉందని, ముఖ్యమంత్రి, కేటీఆర్ సహాయ సహకారాలతో పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటానని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రితోపాటు మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, హరీష్‌రావు, వేముల ప్రశాంతరెడ్డి, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి తదితరులు ప్రారంభోత్సవానికి హాజరవుతారని తెలిపారు.

పటిష్ట బందోబస్తు..

ఎస్పీ డాక్టర్ వినీత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వినీత్

పాల్వంచ: ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. బుధవారం స్థానిక సుగుణ గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో పోలీస్ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలు కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో ట్రాఫిక్ ఆంక్షలను గమనిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. సుమారు 2 వేల మంది పోలీసులతో బందోబస్తుతో భద్రతా చర్యలను చేపట్టామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన ప్రదేశాల్లో సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు.

ఏర్పాట్లను పరిశీలించిన విప్ రేగా



పరిశీలిస్తున్న విప్ రేగా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి వస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన ఏర్పాట్లను ప్రభుత్వ విప్ రేగా కాంతారావు బుధవారం పరిశీలించారు. నూతన కలెక్టరేట్‌ను అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లుతో కలిసి సందర్శించి ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హెలిప్యాడ్‌ను పరిశీలించారు.

ఎంసీహెచ్‌లో శిశువు మృతి

సింగరేణి(కొత్తగూడెం): జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆస్పత్రి(ఎంసీహెచ్)లో బుధవారం ఓ శిశువు మృతిచెందిన విషయం వెలుగులోకి వచ్చింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ బోడ కుమారస్వామి కథనం ప్రకారం.. తిప్పనపల్లికి చెందిన షేక్ బీ మొదటికాన్పు కోసం మంగళవారం ప్రభుత్వ మాతా శిశు ఆస్పత్రికి వచ్చింది. పరీక్షించిన వైద్యులు పిండం అడ్డంగా ఉందని, ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. పేషెంట్ తాలుకువారు మేమే ఎక్కడికీ తీసుకెళ్లబోమని చెప్పడంతో సిబ్బంది ఆస్పత్రిలో చేర్చుకున్నారు. బుధవారం గర్భిణికి నొప్పులు రాకపోవటంతో వైద్యులు ఆపరేషన్ చేసేందుకు సిద్ధమవుతున్న క్రమంలో ఆమెకు కాన్పు జరిగింది. బిడ్డ అడ్డం తిరిగిరావడంతో మృతి చెందింది. అప్పటికీ వైద్యులు, సిబ్బంది తమ శాయశక్తులా ప్రయత్నించారు. కానీ ఆస్పత్రిని అభాసుపాలు చేసేందుకు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని సూపరింటెండెంట్ పేర్కొన్నారు. వైద్యుల తప్పిదం ఉంటే ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కుక్కల దాడిలో మహిళకు గాయాలు

సుజాతనగర్: కుక్కల దాడిలో ఓ మహిళ గాయపడిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. హరిజనవాడ గ్రామానికి చెందిన సాధం సరోజిని సుజాతనగర్ నుంచి హరిజనవాడ గ్రామానికి వెళుతోంది. ఈ క్రమంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో కుక్కలు దాడికి దిగాయి. దీంతో ఆమెకు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

వ్యాపారి ఇంట్లో ఐటీ సోదాలు

అశ్వాపురం: మండల కేంద్రంలోని ఓ ప్రముఖ వ్యాపారవేత్త నివాసంలో ఐటీ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. ఉదయం 11 గంటల సమయంలో వ్యాపారి నివాసానికి చేరుకున్న ఐటీ అధికారులు గేట్‌కు తాళం వేసి ఇంట్లోంచి ఎవరూ బయటకు వెళ్లకుండా, లోపలికి ఎవరూ రాకుండా చర్యలు తీసుకున్నారు. సుమారు మూడు గంటలపాటు సోదాలు నిర్వహించారు. వ్యాపారవేత్త కుటుంబ సభ్యులను విచారించి కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఆయనకు సంబంధించి మణుగూరులోని వ్యాపార సముదాయాల్లో కూడా తనిఖీలు చేపట్టారు. అశ్వాపురంలోని నివాసంతోపాటు మణుగూరు, కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్‌లోని వ్యాపార సముదాయాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తోంది. సోదాలకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మణుగూరు రూరల్ : ఓ వ్యాపారికి చెందిన, పట్టణంలోని వ్యాపారసంస్థల్లో ఐటీ అధికారులు బుధవారం సోదాలు చేశారు. వ్యాపార సంస్థల్లో పని చేస్తున్న ముగ్గురిని విజయవాడ తీసుకెళ్లి విచారిస్తున్నట్లు సమాచారం.

విధుల నుండి సబ్ రిజిస్ట్రార్ తొలగింపు

వైరా: వైరా సబ్ రిజిస్ట్రార్ రాంకుమార్‌ను విధుల నుంచి తొలగించారు. అనుమతి లేని వెంచర్‌లో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన విషయం బయటపడడంతో విచారణ జరిపించిన జిల్లా అధికారులు విధుల నుంచి తొలగిస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా వచ్చిన ఆయనకు మెమో జారీ చేసి పాత స్థానానికే పంపించారు. కాగా, వైరా ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా సీనియర్ అసిస్టెంట్ కరుణకు బాధ్యతలు అప్పగించారు.


తిరుమల ఆలయం వెలుపల తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వర రెడ్డి

ముగిసిన వైకుంఠ ద్వార దర్శనం

తిరుమల: వైకుంఠ ఏకాదశి పర్వదినాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం బుధవారం అర్ధరాత్రితో ముగిసింది. గురువారం నుంచి యథావిధిగా శ్రీవారి కార్యక్రమాలు జరగనున్నాయి. తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. టైమ్ స్లాట్ టికెట్లు పొందిన వారికి కేటాయించిన నిర్ణీత సమయంలో త్వరితగతిన దర్శనం లభిస్తోంది. శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వరరెడ్డి దర్శించుకున్నారు. అలాగే కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని కూడా ఆయన దర్శించుకున్నారు. కాగా, డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగనుంది. ఈవో ఏవీ ధర్మారెడ్డితో మాట్లాడదలచుకున్న భక్తులు 0877-2263261 ఫోన్ నంబర్లో సంప్రదించవచ్చు.

వాల్తేర్ వీరయ్యకు రూ.25, వీరసింహారెడ్డికి రూ.20

10 రోజులు టికెట్ల ధరలు పెంపునకు అనుమతి

సాక్షి, అమరావతి: వాల్తేర్ వీరయ్య, వీరసింహారెడ్డి సినిమాల టికెట్ల ధరలను 10 రోజులపాటు పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఆ సినిమా నిర్మాతలు తమ సినిమాల బడ్జెట్ వివరాలతో సమర్పించిన దరఖాస్తులను హోం శాఖ కమిటీ పరిశీలించి టికెట్ల ధర పెంపుపై సిఫార్సు చేసింది. దీంతో వాల్తేర్ వీరయ్య సినిమాకు టికెట్‌పై గరిష్టంగా రూ.25 చొప్పున, వీరసింహారెడ్డి సినిమాకు రూ.20 చొప్పున పెంపుదలకు అనుమతినిస్తూ హోం శాఖ బుధవారం ఉత్తర్వులిచ్చింది.

నా'రా'బంధువులే'!

టీడీపీ పెద్దల గుప్పిట్లో బడుగుల అసైన్డ్ భూములు

- అమరావతిలో చంద్రబాబు బృందం అక్రమాలు బట్టబయలు
- జీపీఏ, సేల్‌డీడ్లతో 'పచ్చ ముఠా' దందా
- ఇప్పటివరకు సీఐడీ గుర్తించిన అసైన్డ్ భూములు 932.72 ఎకరాలు
- వాటి మార్కెట్ విలువ రూ.3,730.88 కోట్లు
- మాజీ మంత్రి నారాయణ సమీప బంధువుల పేరిట 140 ఎకరాలు
- నారాయణ విద్యా సంస్థలు, రామకృష్ణ హౌసింగ్ ఉద్యోగుల ఖాతాలో 200 ఎకరాలు
- టీడీపీ ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీవీ వియ్యంకుడి పేరిట 40 ఎకరాలు
- చంద్రబాబు బినామీలు, సన్నిహితులు, టీడీపీ నేతల పేరిట 540 ఎకరాలు
- అన్యాక్రాంతమైన మొత్తం అసైన్డ్ భూములు 1,400 ఎకరాలు.. మార్కెట్ విలువ రూ.5,600 కోట్లు



అమరావతిలో ఎల్లో గ్యాంగ్ అసైన్డ్ దందా గ్రామాలవారీగా

గ్రామం	అసైన్డ్ భూములు ఎకరాల్లో
కృష్ణాయపాలెం	9.31
నవులూరు-1	29.30
నవులూరు-2	12.89
కురగల్లు-1	225.34
కురగల్లు-2	2.14
నిడమానూరు-1	63.43
నిడమానూరు-2	41.62
ఉండవల్లి	5.45
పెనుమాక	2.37
లింగాయపాలెం	153.90
ఉద్దండరాయనిపాలెం	20.31
బోరుపాలెం	1.25
పిచుకలపాలెం	9.99
నెక్కల్లు	17.17
నేలపాడు	17.36
తుళ్లూరు-1	43.19
తుళ్లూరు-2	12.52
అనంతవరం	6.96
రాయపూడి-1	87.26
కొండమరాజుపాలెం	6.47
వెలగపూడి	3.30
వెంకటపాలెం	27.39
మందడం-2	133.80
మొత్తం	**932.72**

సాక్షి, అమరావతి: అసైన్డ్ భూముల్లో వాలిపోయిన భూ రాబందుల అక్రమాలు బహిర్గతమయ్యాయి. బడుగు, బలహీన వర్గాల రైతులను బెదిరించి 932.72 ఎకరాల అసైన్డ్ భూములను పచ్చ గద్దలు కాజేసినట్లు వెల్లడైంది. గ్రామాల వారీగా ఎల్లో గ్యాంగ్ అసైన్డ్ భూముల అక్రమాల చిట్టా రట్టైంది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2014- 18 మధ్య చోటు చేసుకున్న ఈ దారుణాలు సీఐడీ దర్యాప్తులో ఆధార సహితంగా, రియల్ ఎస్టేట్ అక్రమ సామ్రాజ్యం భౌగోళిక సరిహద్దులతో సహా వెలుగు చూశాయి. ఇప్పటివరకు బట్టబయలైన అసైన్డ్ భూములు 932.72 ఎకరాలు. చంద్రబాబు చెప్పిన ప్రకారం వాటి మార్కెట్ విలువ ఏకంగా రూ.3,730.88 కోట్లకు పైమాటే! కొనసాగుతున్న సీఐడీ దర్యాప్తులో మరిన్ని అసైన్డ్ బాగోతాలు వెలుగు చూసే అవకాశాలున్నాయి.

కార్యాలయాల వారీగా రికార్డుల పరిశీలన..

రాజధాని అమరావతి ప్రాంతంలో 2014 నాటికి ఎస్సీ, బీసీ రైతుల పేరిట ఉన్న అసైన్డ్ భూములు గత సర్కారు హయాంలో ఇతరుల పేరుతో సీఆర్‌డీఏ రికార్డుల్లో నమోదు కావడం గమనార్హం. సీఐడీ దర్యాప్తులో గుర్తించిన అసైన్డ్ భూముల రికార్డులను గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారులు ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీ చేయించారు. అమరావతి పరిధిలో 932.72 ఎకరాల అసైన్డ్ భూములను టీడీపీ పెద్దలు కొల్లగొట్టినట్టు ఇప్పటివరకు నిర్ధారించారు. భూ సమీకరణ కోసం ఏర్పాటైన సీఆర్‌డీఏ కార్యాలయాల వారీగా రికార్డులను పరిశీలించి నిజాలు నిగ్గు తేల్చారు. మొత్తం 23 సీఆర్‌డీఏ కార్యాలయాల పరిధిలో 932.72 ఎకరాల అసైన్డ్ భూములను కాజేసినట్లు ఆధారాలతో సహా నిరూపితమైంది. రాజధాని నిర్మాణం తరువాత అమరావతిలో ఎకరా మార్కెట్ విలువ కనీసం రూ.4 కోట్లకు చేరుతుందని నాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబే ప్రకటించారు. ఆ ప్రకారం టీడీపీ పెద్దలు హస్తగతం చేసుకున్న 932.72 ఎకరాల అసైన్డ్ భూముల మార్కెట్ విలువ రూ.3,730.88 కోట్లకు పైమాటేనని పరిశీలకులు చెబుతున్నారు.

మొత్తం అసైన్డ్ అక్రమాలు రూ.5,600 కోట్లు!

సీఐడీ దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ మరిన్ని అసైన్డ్ భూముల అక్రమాలు వెలుగు చూసే అవకాశాలున్నాయి. అమరావతి పరిధిలో మొత్తం 1,400 ఎకరాల అసైన్డ్ భూముల రికార్డులను తారుమారు చేసినట్లు గతంలోనే సీఐడీ ప్రాథమికంగా గుర్తించింది. ఆ ప్రకారం టీడీపీ నేతలు దక్కించుకున్న అసైన్డ్ భూముల విలువ రూ.5,600 కోట్లని అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి.

'నారా'యణ బంధువులు, బినామీలే..

అసైన్డ్ భూముల అక్రమాల తీగ లాగితే నారా చంద్రబాబు, పొంగూరు నారాయణ బంధువులు, బినామీల ఇళ్లల్లో డొంక కదులుతోంది. బినామీలు, బంధువుల పేరిట అసైన్డ్ భూములను జీపీఏ, సేల్ డీడ్లు ద్వారా హస్తగతం చేసుకున్నట్లు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. టీడీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు సమీప బంధువు పేరిట కూడా అసైన్డ్ భూములను కొల్లగొట్టారు. నారాయణ విద్యా సంస్థలు, ఆయన సమీప బంధువుకు చెందిన రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ చిరుద్యోగుల పేరిట అసైన్డ్ భూములను కాజేశారు. ఇప్పటివరకు గుర్తించిన 932.72 ఎకరాల అసైన్డ్ భూముల సేల్‌డీడ్లు, జీపీఏలను సీఐడీ అధికారులు విశ్లేషించగా ఈ అక్రమాలు వెలుగుచూశాయి.

'ఎన్‌స్పైర'లో కీలక ఆధారాలు స్వాధీనం

మాజీ మంత్రి పి.నారాయణ కుటుంబానికి చెందిన హైదరాబాద్‌లోని 'ఎన్ స్పైర' మేనేజ్‌మెంట్ సర్వీసెస్ కార్యాలయంలో సీఐడీ అధికారుల సోదాలు బుధవారం ముగిశాయి. కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లు, బ్యాంకు ఖాతా లావాదేవీల పత్రాలు, ఇతర కీలక రికార్డులను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకుని విశ్లేషిస్తున్నారు. మునుముందు మరిన్ని కీలక అంశాలు బహిర్గతమవుతాయని భావిస్తున్నారు.



జగనన్న తోడు లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

'చిరు' రుణాల్లో ఏపీ ఫస్ట్

- చిరు వ్యాపారులకు సున్నా వడ్డీ రుణాల్లో దేశ చరిత్రలోనే రాష్ట్రం రికార్డు
- దేశ వ్యాప్తంగా 24.06 లక్షల మందికి రుణాలు.. ఇందులో ఒక్క ఏపీలోనే 15.31 లక్షలు
- జగనన్న తోడు లబ్ధిదారుల ఖాతాల్లో వడ్డీ జమ చేసిన సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: చిరు వ్యాపారులకు సున్నా వడ్డీ రుణాలు ఇవ్వడంలో దేశ చరిత్రలోనే ఆంధ్రప్రదేశ్ రికార్డు సృష్టించిందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. దేశంలో మొత్తం మీద చిరు వ్యాపారులకు 24.06 లక్షల మందికి రుణాలు ఇస్తే, ఇందులో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే జగనన్న తోడు పథకం కింద 15.31 లక్షల మందికి రుణాలు ఇచ్చామని స్పష్టం చేశారు. రుణాల లెక్కన తీసుకుంటే దేశ వ్యాప్తంగా 39.21 లక్షల రుణాలకు గాను, ఒక్క మన రాష్ట్రంలో మాత్రమే 24.06 లక్షల మందికి రుణాలు ఇచ్చామన్నారు. జగనన్న తోడు పథకం కింద చిరు వ్యాపారులకు ఆరవ విడత రూ.10 వేల వరకు వడ్డీ లేని రుణాలను ఇచ్చే కార్యక్రమాన్ని బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. పూర్తి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున 3.95 లక్షల మంది చిరు వ్యాపారులు, సంప్రదాయ చేతివృత్తుల వారికి బ్యాంకుల ద్వారా కొత్తగా రూ.395 కోట్ల రుణాలు అందించడంతో పాటు, గత 6 నెలలకు సంబంధించిన రూ.15.17 కోట్ల వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను కంప్యూటర్‌లో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. చిరు వ్యాపారుల్లో 80 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములకు 'జగనన్న తోడు' అందుతోందని తెలిపారు. 3.95 లక్షల మందిలో 3.67 లక్షల మంది సకాలంలో రుణాలు చెల్లించి, మళ్లీ రెండోసారి రుణాలు తీసుకుంటున్నారని చెప్పారు. వీరు కాక మరో 28 వేల మందికి ఇవాళ రుణాలు ఇస్తూ కొత్తగా ఈ పథకంలో తీసుకొచ్చామన్నారు. మొత్తంమ్మీద జగనన్న తోడు ద్వారా దాదాపు 15.31 లక్షల చిరు వ్యాపారుల కుటుంబాలకు మంచి జరుగుతోందని స్పష్టం చేశారు.

47 హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: ఏపీ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో 47 హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుల భర్తీకి వైద్య శాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. https://dmeaponline.com వెబ్‌సైట్ లో ఆన్‌లైన్ అప్లికేషన్‌ను అందుబాటులో ఉంచారు. బుధవారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ మొదలు పెట్టారు. అర్హులైన వైద్యులు ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ.వెయ్యి, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.750 చొప్పున దరఖాస్తు రుసుం ఉంటుంది. రెండేళ్ల కాలపరిమితితో కాంట్రాక్ట్ ప్రాతిపదిక పోస్టుల భర్తీ చేపడతారు. ఎంబీబీఎస్/బీడీఎస్ పూర్తి చేసి హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్ డిగ్రీ/హాస్పిటల్ మేనేజ్‌మెంట్/ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్/ఎంబీఏ హ్యూమన్ రీసోర్స్ కోర్సులు చేసి, ఇతర అర్హతలున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నాటికి గరిష్ట వయోపరిమితి 42 ఏళ్లు మించకుండా ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు మూడేళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్లు వయోపరిమితి నుంచి మినహాయింపు ఉంటుంది. http://hmfw.ap.gov.in వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్‌ను అందుబాటులో ఉంచారు.

జిల్లా వార్తలు

వచ్చే నెల 11న లోక్ అదాలత్


మాట్లాడుతున్న జడ్జి చంద్రశేఖరప్రసాద్

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టులో ఫిబ్రవరి 11న జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్ తెలిపారు. బుధవారం కోర్టుహాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు తమ కేసులను లోక్ ఆదాలత్‌లో రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని, తద్వారా సమయం, డబ్బు వృథా కావని అన్నారు. మోటార్ వాహన ప్రమాద బాధితుల కేసులలో కక్షిదారులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి, సీనియర్ న్యాయవాదులు గంగాధర్, కొత్తపల్లి రామారావు, గాదె రామచంద్రారెడ్డి, రావి విజయ్‌కుమార్, రమేష్‌కుమార్ మక్కడ్, బీమా కంపెనీల నుంచి రామకృష్ణ, వసంతకుమార్, శోభన్, స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ మెండు రాజమల్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 9 నుంచి 11 వరకు నిర్మల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అండ్ సైన్స్‌ఫెయిర్ పోటీల్లో పాల్గొన్న జిల్లా విద్యార్థుల్లో ఒకరు జాతీయ స్థాయికి, ఇద్దరు సౌత్ ఇండియా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐటీడీఏ పరిధిలోని రొంపేడు ఆశ్రమ పాఠశాలకు చెందిన అశ్విని బయో విలేజ్ ప్రాజెక్టులో జాతీయ స్థాయికి ఎంపికై ందని, ఇల్లెందు ఆశ్రమ పాఠశాలకు చెందిన కార్తీక, మణుగూరు ఎక్సలెంట్ పాఠశాలకు చెందిన ఎండీ రేయాన్ సౌత్ ఇండియా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. వీరితో పాటు సౌత్ ఇండియా స్థాయి పోటీలకు ఇల్లెందు సింగరేణి పాఠశాల ఉపాధ్యాయురాలు విష్ణుప్రియ టీచర్ ఎగ్జిబిట్‌గా ఎంపికయ్యారని తెలిపారు.

కోటలా కలెక్టరేట్

- రాష్ట్రంలోనే తొలిసారిగా కొత్తగూడెంలో గుట్టపై నిర్మాణం
- కార్యాలయానికి ప్రత్యేక ఆకర్షణగా గార్డెన్లు
- పాత రాతి కట్టడాల పద్ధతుల్లో నిర్మాణం
- కలెక్టరేట్ ఆర్కిటెక్ట్ ఉషారెడ్డి వెల్లడి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ ఏర్పాటైన తర్వాత అన్ని జిల్లాల్లో నూతన కలెక్టరేట్ భవనాల నిర్మాణం జరుగుతోంది. అందులో అన్నింటి కంటే భిన్నమైనదిగా భద్రాద్రి జిల్లా కలెక్టరేట్ నిలుస్తుందని అచ్చ తెలంగాణ బిడ్డ, ప్రముఖ ఆర్కిటెక్ట్ ఉషారెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ సూచనలతో నూతన కలెక్టరేట్ భవనాలకు ఆమె డిజైన్లు ఇచ్చారు. నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా మన పాలనా భవనానికి సంబంధించిన విశేషాలను ఆమె 'సాక్షి'కి తెలిపారు. అవి ఆమె మాటల్లోనే.. కొత్తగూడెం – పాల్వంచ మధ్యన ఎత్తయిన కొండపై జాతీయ రహదారి పక్కన స్థలాన్ని కలెక్టరేట్ కోసం ఎంపిక చేశారు. ఈ స్థలంలో ముందు భాగం కంటే వెనుక భాగం పది అడుగుల ఎత్తులో ఉంది. దీంతో ఇతర జిల్లాలకు ఇచ్చిన జీ ప్లస్ టూ డిజైన్ ఇక్కడ నప్పదని.. మా టీమ్‌తో కలిసి కొత్త స్కెచ్‌లు రెడీ చేశాం. సీఎం కేసీఆర్ ఇచ్చిన సూచనలు పాటిస్తూనే ఒకే భవనంలో జీ ప్లస్ టూ, జీ ప్లస్ వన్‌ను కలిపేసి డిజైన్ సిద్ధం చేశాం. ఈ కలెక్టరేట్‌లో ముందు సగం జీ ప్లస్ టూగా ఉంటే వెనుక సగ భాగం జీ ప్లస్ వన్‌గా ఉంది. కలెక్టరేట్ భవనం మధ్యలో స్టెప్‌డ్ గార్డెన్‌ను డిజైన్ చేశాం. నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ గార్డెన్ ఓపెన్ ఆడిటోరియంలా కనిపిస్తూ కలెక్టరేట్‌కు కొత్త అందాన్ని తీసుకొచ్చింది. అదే విధంగా హైవే ఎంట్రన్స్ నుంచి ప్రధాన భవనం ప్రవేశం వరకు దాదాపు రెండు అంతస్తుల అంత ఎత్తయిన ప్రదేశం ఉంది. సుమారు రెండు ఎకరాల్లో విస్తరించిన ఈ ప్రదేశంలో అందమైన గార్డెన్ వచ్చేలా ప్లాన్ చేశాం. నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ కలెక్టరేట్‌ను చూస్తే హైవే పక్కన గుట్ట, గుట్ట మీద భవనం, మధ్యలో అందమైన గార్డెన్‌తో ఓ రాజకోటను తలపించేలా ఉంది. అంచనాలకు మించిన ఆకర్షణ ఈ భవనం సొంతం. ప్రస్తుతం కొత్తగూడేనికి వాడిన డిజైన్‌ను ములుగు జిల్లా కలెక్టరేట్‌కూ ఉపయోగిస్తున్నాం.

పదిహేను ఏళ్లకు ఒకసారి..

భవనాలు కట్టిన కొత్తలో తళతళమంటాయి. కానీ నాలుగైదు ఏళ్లకే రంగులు వెలిసిపోయి కళా విహీనంగా కనిపిస్తాయి. ప్రజాధనంతో కట్టే ఈ కలెక్టరేట్ అలా కళ కోల్పోకూడదనే లక్ష్యంతో పాత రాతి కట్టడాల శైలిని అనుసరించాం. భవనం బయటి వైపు గోడలకు స్టోన్స్ వచ్చేలా డిజైన్ చేశాం. వీటికి రంగులు వేయాల్సిన పని ఉండదు. నీటితో కడిగినా, వర్షంలో తడిసినా మళ్లీ తనుకులీనుతాయి. ప్రజలు ఎక్కువగా వచ్చి పోయే ప్రదేశాల్లో టైల్స్‌కు బదులు గ్రానైట్ ఉపయోగించాం. సాధారణ భవనాలకు ఐదేళ్లకు ఓ సారి రంగులు, ఇతర మెయింటెనెన్స్ చేయాల్సి వస్తే ఈ కొత్త భవనాలకు పదిహేనేళ్ల వరకు ఆ అవసరం ఉండదు. 30 ఏళ్ల వరకు ఈ భవనం కొత్తదానిలాగే కనిపిస్తుంది. ఇక గాలి వెలుతురు బాగా వచ్చేలా పెద్ద కిటికీలు, వరండాలు, పెరడు (ఖాళీ స్థలం)లను డిజైన్‌లో భాగం చేశాం.


కలెక్టరేట్ పనులను పరిశీలిస్తున్న ఉషారెడ్డి(ఫైల్)

వాస్తు పాటించాం..

రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించిన అన్ని కలెక్టరేట్లలో వాస్తు పాటించాం. తూర్పు, ఉత్తర ముఖంగా వీటి నిర్మాణం జరిగింది. కొత్తగూడెం కలెక్టరేట్ ఉత్తర ముఖంగా ఉంటుంది, నైరుతి దిక్కున గ్రౌండ్ ఫ్లోర్‌లో కలెక్టర్ చాంబర్, దానిపైన సెకండ్ ఫ్లోర్‌లో మినిస్టర్ చాంబర్‌లు ఉన్నాయి. ఈశాన్యం వైపున ట్రెజరీ వస్తుంది. వీటితో పాటు సంక్షేమ శాఖలకు సంబంధించిన విభాగాలు ప్రజలు త్వరగా గుర్తించేలా డిజైన్‌లో మార్పులు చేశాం. కలెక్టరేట్ నిర్మించిన గుట్టపై నీళ్లు వచ్చే ఊట ఉంది. ఈ నీటిని మళ్లించి ఓ కొలను ఏర్పాటు చేశాం. ఇది సహజ సిద్ధమైన కొలనులా కనిపిస్తూనే ఇంకుడు గుంతలా కూడా పని చేస్తుంది.

కొల్హాపూర్ స్థానంలో 'బెళగావి'

- ఈనెల 17న ప్రారంభం
- కొల్హాపూర్ సమయాల్లోనే రాకపోకలు
- కొత్త రైలును ప్రకటించిన అధికారులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లావాసుల చిరకాల వాంఛను నెరవేరుస్తూ కొత్త రైలును రైల్వే శాఖ ప్రకటించింది. మణుగూరు–బెళగావి (కర్నాటక) ఎక్స్‌ప్రెస్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈనెల 17 నుంచి ఈ రైలు రాకపోకలు సాగించనుంది. ముందుగా ప్రయోగాత్మకంగా 17 నుంచి మార్చి చివరి వరకు ఈ రైళ్లు ఇరువైపులా నడుస్తాయి. ప్రయాణికుల నుంచి వచ్చే స్పందనను బట్టి రైలును కొనసాగిస్తారు.

ఆ రైలు బదులు..

ప్రస్తుతం జిల్లా నుంచి మణుగూరు సూపర్‌ఫాస్ట్, సికింద్రాబాద్ మెమూ ఎక్స్‌ప్రెస్ (కాకతీయ) రైళ్లు రాష్ట్ర రాజధానికి నడుస్తున్నాయి. కరోనా కంటే ముందు మణుగూరు – కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ కూడా అందుబాటులో ఉండేది. మిగిలిన రెండు రైళ్లు సికింద్రాబాద్ వరకే వెళ్తుండగా కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి వరకు వెళ్లడంతో పాటు ఆపైన కర్నాటక, మహారాష్ట్రల్లో వివిధ గమ్యస్థానాలకు ప్రయాణికులను చేర్చేది. కరోనా తర్వాత అనేక రైళ్లు పునఃప్రారంభమైనా కొల్హాపూర్ రైలును మాత్రం పునరుద్ధరించలేదు. దీంతో ఈ రైలును ప్రారంభించాలనే డిమాండ్లు ఊపందుకున్నాయి. అయితే కరోనా తర్వాత అనేక రైళ్ల రేక్ షేరింగ్ మారింది. కొల్హాపూర్ స్థానంలో బెళగావి – సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ను మణుగూరు వరకు పొడిగించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. దీంతో కొల్హాపూర్ రైలు రాకున్నా దానికి ప్రత్యామ్నాయంగా బెళగావి ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి వచ్చినట్టయింది.

హైదరాబాద్‌కు మూడు రైళ్లు..

ప్రస్తుతం హైదరాబాద్ వెళ్లడానికి తెల్లవారుజామున కాకతీయ, రాత్రి మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లు అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు మధ్యాహ్నం వేళ బెళగావి ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి వచ్చింది. మధ్యాహ్నం 3:40 గంటలకు ఈ రైలు మణుగూరులో బయలుదేరి భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) స్టేషన్‌కు 4:40 గంటలకు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 5 గంటలకు బయలుదేరి సికింద్రాబాద్ స్టేషన్‌కు రాత్రి 10:10 గంటలు, లింగంపల్లి స్టేషన్‌కు 10:58 గంటలకు చేరుకుంటుంది. మరుసటి రోజు మధ్యాహ్నం 3:55 గంటలకు బెళగావి చేరుకుటుంది. మార్గమధ్యంలో ఈ రైలు తెలంగాణలో డోర్నకల్, మహబూబాబాద్, కేసముద్రం, వరంగల్, కాజీపేట, జనగామ, భువనగిరి, వికారాబాద్, తాండూరు స్టేషన్లలో ఆగుతుంది. ఆపైన రాయచూర్, మంత్రాలయంరోడ్, గుంతకల్లు, బళ్లారి, హోస్పేట్, గదగ్, హుబ్లీ వంటి ప్రముఖ పట్టణాల మీదుగా బెళగావి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బెళగావిలో మధ్యాహ్నం 1:10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 4:10 గంటలకు లింగంపల్లి, ఉదయం 5:25 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. అక్కడ 5:40 గంటలకు బయలుదేరి ఉదయం 10:45 గంటలకు భద్రాచలంరోడ్, మధ్యాహ్నం 12:50 గంటలకు మణుగూరు వస్తుంది. ఈ రైలులో మొత్తం 12 కోచ్‌లు ఉంటాయి. రిజర్వేషన్ విషయానికి వస్తే మణుగూరు వైపు వచ్చేప్పుడు ఈ రైలు నంబర్ 07335గా ఉండగా, బెళగావి వైపు వెళ్లేప్పుడు 07336గా ఉంది.

ఉత్సవాల్లో ప్రత్యేకం.. 'కూడారై'


108 గంగాళాలతో స్వామివారికి నైవేద్యం సమర్పిస్తున్న అర్చకులు

108 గంగాళాలతో పాయసం నివేదన

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో ప్రత్యేకమైన కూడారై వేడుకను బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ధనుర్మాసోత్సవాల్లో 27వ రోజున ఈ వేడుక జరపడం ఆనవాయితీ. శ్రీరంగనాథుడితో తన వివాహం జరిగితే 108 గంగాళాలతో పాయసాన్ని నివేదనగా సమర్పిస్తానని గోదాదేవి అమ్మవారు మొక్కుకున్నారని, వివాహమైన తర్వాత ఆ మొక్కు చెల్లించారని ప్రతీతి. ఇందులో భాగంగా స్వామి వారితో పాటుగా గోదాదేవి అమ్మవారిని బేడా మండపంలో కొలువుదీర్చారు. ప్రత్యేక పూజలు జరిపి, ద్రవిడ ప్రబంధాలు పఠించారు. అనంతరం పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు. ఆ తర్వాత భక్తులకు ప్రసాదం అందజేశారు.

కమనీయంగా నిత్యకల్యాణం..

రామాలయ ప్రాంగణంలోని బేడా మండపంలో స్వామి వారి నిత్యకల్యాణ వేడుక కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.


స్వామి వారికి రాపత్తు సేవ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న స్వామీజి

చిత్రకూట మండపంలో రాపత్తు సేవ

శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో జరుగుతున్న ముక్కోటి అధ్యయనోత్సవాల్లో భాగంగా బుధవారం చిత్రకూట మండపంలో జీయర్ మఠం ఆధ్వర్యంలో రాపత్తు సేవ నిర్వహించారు. పల్లకీలో స్వామివారిని వేంచేపు చేసి.. మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ తీసుకొచ్చి వేదికపై కొలువుదీర్చారు. అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి హారతి సమర్పించారు. కార్యక్రమంలో త్రిదండి దేవనాథ రామానుజ స్వామి పాల్గొని సందేశం ఇచ్చారు. కాగా స్వామి వారికి జరుగుతున్న రాపత్తు సేవలు గురువారంతో ముగియనున్నాయి. శుక్రవారం నుంచి 15 వరకు విలాసోత్సవాలు, 19న విశ్వరూప సేవ జరగన్నాయి.

ఆర్టీసీ లాజిస్టిక్స్‌ను ఆదరించండి

చుంచుపల్లి: టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న లాజిస్టిక్స్(కార్గో) సర్వీసులను ప్రజలు ఆదరించాలని కరీంనగర్ జోన్ డిప్యూటీ సీటీఎం మధుసూదన్ కోరారు. ఖమ్మం, వరంగల్ జిల్లాల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్‌తో కలిసి కొత్తగూడెంలో బుధవారం ప్రదర్శన నిర్వహించి లాజిస్టిక్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీటీఎం మాట్లాడుతూ ప్రైవేట్ లాజిస్టిక్స్‌తో పోలిస్తే ఆర్టీసీ చార్జీలు తక్కువగా ఉండడంతో పాటు వేగవంతంగా పార్సిళ్లను వినియోగదారులకు చేరవస్తున్నామని తెలిపారు. అనంతరం తరచుగా లాజిస్టిక్స్ సేవలను ఉపయోగించుకుంటున్న పలు సంస్థల బాధ్యులు హేమంత్, నిరంజన్, ప్రభాకర్, విజయ్‌ను సత్కరించారు. లాజిస్టిక్ మేనేజర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శనలో ఆర్టీసీ లాజిస్టిక్స్ ఉద్యోగులు